క్లుప్తంగా

23, 24 తేదీల్లో ఇంటర్నేషనల్ వెబినార్



బ్రోచర్ విడుదల చేసిన కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు వైవీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో రీసెర్చ్ మెథడాలజీ ఇన్ మెటీరియల్స్ సైన్స్ అనే అంశంపై ఇంటర్నేషనల్ వెబినార్ నిర్వహించనున్నట్టు ఏలూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబినార్ బ్రోచర్ విడుదల చేశారు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని గిరిబాబు కోరారు. వెబినార్ సమన్వయకర్త కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు కె.రమేష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

వినికిడి పరికరాల పంపిణీ



వినికిడి పరికరాలను పంపిణీ చేస్తున్న వేణుబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు సహకారంతో ముగ్గురికి వినికిడి పరికరాలను ఏలూరు లయన్స్ క్లబ్ గవర్నర్ కాకరాల వేణుబాబు, కోటేశ్వరరావు, కిషోర్ కుమార్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రత్నకుమార్, ఎం చలపతిరావు, కంది బాలకృష్ణ, తమ్మన సుహాస్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కిసాన్ సమ్మాన్ నిధి యోజన పెంపుపై హర్షం

ఏలూరు (టూటౌన్): కిసాన్ సమ్మాన్ నిధి యోజన (రైతుకు సత్కారం)ను ఏడాదికి రూ.6 వేలు నుంచి రూ.10 వేలకు పెంచడంపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేసారు. దీంతో ఎందరో చిన్న సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకికి బీజేపీ కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా తరపున ధన్యవాదాలు తెలిపారు.

5న బైక్ ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 5న విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు హిందూ బంధువులంతా బైక్ ర్యాలీగా వెళ్లడానికి తరలిరావాలని భజరంగ్‌దళ్ ప్రతినిధి రామనపూడి శివ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు జూట్ మిల్లు వద్ద చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం వద్దకు రావాలన్నారు.

చలితో సతమతం

- మూడు రోజులుగా ఏలూరులో కురుస్తున్న మంచు
- రాత్రి వేళల్లో తగ్గుతున్న ఉష్ణోగ్రత
- రాత్రి 10 గంటలకే నిర్మానుష్యంగా నగరం



ఏలూరు ఇండోర్ స్టేడియంలో మంచులో వాకింగ్ చేస్తున్న వాకర్స్



నగర శివారు సాయి నగర్‌లో ఉదయం కురుస్తున్న మంచు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శీతాకాలం వచ్చిందంటే చలి వాతావరణం ప్రజలను ఇబ్బందిపెట్టడం సహజం. ఈ ఏడాది గత రెండు వారాల క్రితం వరకు తుఫాను ప్రభావంతో వీచిన తీవ్ర చలిగాలులకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తుఫాను ప్రభావం కారణంగా మంచు లేనప్పటికీ ఉష్ణోగ్రతలు భారీ స్థాయిలో తగ్గాయి. తుఫాను ప్రభావం పూర్తిగా తొలగిపోగా, ప్రస్తుతం చలి ప్రభావం ఎక్కువైంది. నూతన సంవత్సర వేడుకల వేడితో ఇప్పటి వరకూ చలి ప్రభావాన్ని పెద్దగా లెక్కచేయని ప్రజలు ఇప్పుడు చలికి గజగజలాడుతున్నారు. మధ్యాహ్నం వాతావరణం కూడా మరీ ఎండగా లేకుండా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

తెల్లారినా వీడని మంచు

గత మూడు రోజులుగా ఏలూరు నగరంపై మంచు దుప్పటి కప్పుతోంది. తెల్లవారు జామున 4 గంటల నుంచి మంచు ప్రభావం మెల్లమెల్లగా కనిపిస్తూ తెల్లవారిన తరువాత సుమారు 5.30 గంటల నుంచి 7 గంటల మధ్యలో కురుస్తూ ఒక పక్క ఆహ్లాదాన్ని మరో పక్క ఇబ్బందిని కలిగిస్తోంది. తెల్లవారు జామున వాకింగ్‌కి వెళ్లేవారు, వివిధ క్రీడల శిక్షణకు వెళ్లేవారు, ఔట్‌డోర్‌లో షటిల్ తదితర ఆటలు ఆడుతూ ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వారు మంచు ప్రభావాన్ని చవిచూస్తున్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 5 గంటల నుంచే జన సంచారం కనిపించే నగరంలోని ప్రధాన రహదారులు ప్రస్తుతం ఉదయం 6.30 గంటలు దాటినా పెద్దగా జనం కనిపించడంలేదు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునే వారు, విద్యార్థులు పరీక్షలు దగ్గరపడుతుండడంతో తప్పనిసరి పరిస్థితిలో ఉదయం 8 గంటలకే బయటకు రావాల్సి వస్తోంది. తెల్లవారు జామున బయటకు వచ్చే వారు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లను చలి నుంచి రక్షణగా వినియోగిస్తున్నారు. గత మూడు రోజులుగా నగరంలో కనిష్ట ఉష్ణోగ్రత 19 నుంచి 21 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. మధ్యాహ్నం పూట గరిష్ఠంగా 29 నుంచి 32 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

తగ్గిన ఉష్ణోగ్రతలు

శీతాకాలం ప్రభావంతో సాయంత్రం 5.30 గంటలకే చీకటి పడుతుంది. అప్పటి నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. గత వారం రోజులుగా రాత్రి 10 గంటలకు 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక తెల్లవారుజాము ఉష్ణోగ్రతలు 19 డిగ్రీలకు పడిపోతున్నాయి. నగరంలో మరో 14 రోజుల పాటు ఇటువంటి ఉష్ణోగ్రతలే నమోదయ్యే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేస్తున్న నేపథ్యంలో సంక్రాంతి పండుగ నాటికి కూడా చలి వాతావరణమే ఉంటుందని చెబుతున్నారు. సత్రంపాడు, శాంతి నగర్, సోమవరప్పాడు, తంగెళ్లమూడి, జాలిపూడి, వెంకటాపురం, చాటపర్రు, చొదిమెళ్ల, శనివారపు పేట తదితర ప్రాంతాల్లో గృహ సముదాయాలు పెద్దగా లేని, ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం మంచు ప్రభావం ఎక్కువగా ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి



మంచులో ఎక్కువగా సంచరించకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. మంచు ప్రభావంతో శ్వాసకోస వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ఇవి దీర్ఘకాలికంగా బాధించే ప్రమాదం ఉంటుంది. ఆస్తమా వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడేవారు ఎండ వచ్చే వరకు బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వెళ్లాల్సివస్తే స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు లేదా మాస్కులు ధరించి వెళ్లాలి.

– పి.సాయి శ్రీవల్లి, వైద్యురాలు

9 నుంచి వేంగి క్రికెట్ టోర్నమెంట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువతను ప్రోత్సహించేందుకు వేంగి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు శేఖర్, హరి, వెంకట్, వినయ్, గణేష్ తెలిపారు. ఈ టోర్నమెంట్ స్థానిక సీఆర్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 12వ వరకు కొనసాగుతుందని వివరించారు. క్రికెట్ టీమ్లు ఫోన్ నంబర్లు 94413 30087, 86887 77878, 98486 66693లో సంప్రదించవచ్చని తెలిపారు. పండుగ రోజుల్లో యువత జూదాలవైపు మరలకుండా టోర్నమెంట్ దోహదపడుతుందని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో మెప్మా ఆధ్వర్యంలో హోమ్ ట్రి యాంగిల్ సంస్థ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనరు ఎ.భానుప్రతాప్ తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్లంబర్లు, పెయింటర్స్, కార్పెంటర్స్, ఎలక్ట్రీషియన్, ఏసీ, వాషింగ్ మిషన్, టీవీ, గ్రీజర్, మెకానిక్స్, బ్యూటీషియన్లకు (పురుషులు – స్త్రీలు) సంబంధిత రంగాల్లోని సర్వీసు ప్రొవైడర్లకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వీరు ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 80746 83589, 99496 23255లో సంప్రదించాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజ చేస్తున్న అర్చకులు



చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు మచిలీపట్నానికి చెందిన మడమల రాంబాబు భాగవతార్ భక్త ప్రహ్లాద అనే అంశంపై హరి కథా కాలక్షేపం చేశారు. రాత్రి 7.30 గంటల నుంచి వంగల శ్రావణి బృందం ప్రదర్శించిన ఒడిస్సీ, కూచిపూడి నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వట్లూరులో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు ప్రాంతంలో ఇంటి తాళాలు పగులగొట్టిన 9 కాసుల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకుపోయారు. వట్లూరుకు చెందిన ఘంటా వీర వెంకట సత్యసాయి వర ప్రసాద్ ఈనెల 10న తన ఇంటికి తాళాలు వేసి అత్తగారి ఊరు ముదినేపల్లి వెళ్లారు. తన కుటుంబ సభ్యులను తీసుకుని గురువారం ఉదయం రాగా ఇంటి తాళాలు, ఇంట్లోని బీరువా పగులగొట్టి ఉన్నాయి. బంగారు అభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించి ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కుంగిన తూరలు.. తరచూ రోడ్డు ప్రమాదాలు

- నాలుగు నెలలైనా పట్టించుకోని పాలకులు
- బావాయిపాలెం టర్నింగ్ యమ డేంజర్
- భారీ వాహనాల రాకపోకలతో పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ప్రయాణికులు, స్థానికులు



బావాయిపాలెం- గణపవరం మలుపులో పగిలిన తూరపై నుంచి వెళుతున్న భారీ వాహనాలు



గణపవరం - బావాయిపాలెం మార్గంలో కుంగిన రహదారి



పగిలిన తూరకు రైతులు సపోర్టుగా ఉంచిన కంకర బస్తాలు, హెచ్చరిక కర్ర



బావాయిపాలెం మార్గంలో అలుగోడు సెంటర్లో పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్న తూర

నిడమర్రు: బావాయిపాలెం అలుగోడు సెంటర్లో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. గణపవరం నుంచి క్రొవ్విడి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పలు చోట్ల కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. గణపవరం నుంచి బావాయిలెం మార్గం మలుపులో ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో, రోడ్డుకు ఇరువైపులా పంట కాలువ తూరలు పగిలిపోవడంతో రోడ్డు 20 అడుగుల నుంచి 8 అడుగులకు కుంచించుకుపోయింది. దీంతో ఆ మలుపులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో ఉన్న పంట కాలువ తూర పగిలి నాలుగు నెలలవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని బావాయిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో చీకట్లో ప్రయాణం మరింత ప్రాణాల మీదకు తెస్తోందని వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలపై అనేక సార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ ఎవరూ స్పందించలేదని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రమాదాల నివారణకు తాత్కాలిక ఏర్పాట్లు

పాలకులు, అధికారులకు నాలుగు నెలలుగా విన్నవించి విసిగిపోయిన బావాయిపాలెం గ్రామస్తులు ఆ రహదారిలో ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టారు ఏర్పాట్లు చేసుకున్నారు. పగిలిపోతున్న తూరకు కంకర బస్తాలు సపోర్టుగా ఉంచారు. దీంతో కొంతమేర వాహనాల రాకపోకలకు అవకాశం ఏర్పడింది. స్థానిక యువకులు పగిలిన తూరకు ఇరువైపులా కంకర లోడు దింపి గుట్టలుగా ఉంచారు. చీకట్లో ప్రయాణికులను హెచ్చరించేలా కుంగిపోయిన తూరల వద్ద హెచ్చరిక జెండాలు పాతారు. అయినా ఇటీవల బొమ్మిలి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీధర్, సత్యనారాయణ అనే ప్రయాణికులు ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో గాయపడినట్లు స్థానికులు చెపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రోడ్డు నిర్మాణం

వైఎస్సార్‌సీపీ హయాంలో 2022లో క్రొవ్విడి నుంచి గణపవరం వరకు రహదారిని రూ.3 కోట్లు నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రహదారి నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ రోడ్డు రోజు రోజుకు ఛిద్రమవుతోంది. బావాయిపాలెం నుంచి క్రొవ్విడి శివారు వరకూ 3 చోట్ల ఈ రహదారి ఇరువైపులా కుంగిపోయింది. అధికారులు స్పందించి భారీ ప్రమాదాలు జరగక ముందే రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తూర పగిలి నాలుగు నెలలు అవుతున్నా..



అలుగోడు మలుపులో రోడ్డు మధ్యలో సిమెంట్ తూర పగిలిపోయి నాలుగు నెలలు అవుతోంది. అప్పటి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తూర పగిలి రోడ్డు వెడల్పు రోజు రోజుకు కుంచించుకుపోతోంది. దీంతో ఇక్కడ తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్లారేగానీ నేటికీ నివారణ చర్యలు చేపట్టలేదు.

– గొర్రెల వెంకన్న, రైతు, బావాయిపాలెం

భారీ వాహనాల ప్రయాణంతో ఆందోళన



నారాయణపురం నుంచి ఆకివీడు వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం. దీంతో రోజూ వందలాది భారీ వాహనాలు ఈ మార్గంలోనే తిరుగుతుంటాయి. చినకాపవరం– రాజమండ్రి ఆర్టీసీ బస్‌తోపాటు 20 వరకూ స్కూల్ బస్సులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు రోజు రోజుకూ కోతకు గురవుతోంది. ఏ పెద్ద ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

– బత్తెన చిన్న, బావాయిపాలెం

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	40
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32	కంద	60
కాకర కాయలు	36-44	బీట్‌రూట్	52
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	92
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	56	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	24-30	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ వాటిక

దెందులూరు: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి భరోసాకు ప్రభుత్వం సంబంధిత గ్రామాల్లో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన నగదుతో పోషణ వాటి అభివృద్ధిపరిచే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్నారు. దెందులూరు మండలం దెందులూరులోని ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని టీచర్లు నిర్వహిస్తున్న పోషణ్ వాటికను జిల్లా పీడీ శారద, పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న వాటికను వారు పరిశీలించారు. కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డెన్‌లో ఆకుకూరలను, కూరగాయలను పెంచి వాటిని వినియోగించడం వల్ల అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించవచ్చని పీడీ శారద, సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు.

దుప్పట్ల పంపిణీ

దెందులూరు: చల్లచింతలపూడికి చెందిన జై గౌడ సేన రాష్ట్ర నాయకుడు నూతి రవీందర్ గౌడ్ బుధవారం దెందులూరులో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో చిన్నారుకులకు దుప్పట్లు, పెన్సిళ్లు పంపిణీ పంపిణీ చేశారు. బాలసదనం సూపరింటెండెంట్ ఎస్‌బేబి సరోజినీ, అకౌంటెంట్ దుర్గామల్లేశ్వరితో కలిసి రవీందర్ గౌడ్ హాస్టల్లో ఉండే చిన్నారులకు దుప్పట్లు, పెన్సిళ్లు అందజేశారు. జై గౌడ సేన సంఘం నాయకులు బొప్పన పూర్ణచంద్రారావు ఉన్నారు

జనార్దనస్వామి ఊరేగింపు

దెందులూరు: కొవ్వలిలో జనార్దన స్వామి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి ఆలయంలో భక్తులు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో గ్రామంలోని వీధుల గుండా పల్లకిలో ఊరేగించారు. మేళతాళాలతో ఊరేగింపు ఘనంగా కొనసాగింది. భక్తులు, స్వామివారిని దర్శించుకుని పువ్వులు, పండ్లు కానుకలు అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దెందులూరు: చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు నూతన సంవత్సర క్యాలెండర్లను దెందులూరు బ్యాంక్ మేనేజర్ టి.నాగార్జున, క్యాషియర్ ఉప్పలపాటి రామకృష్ణ ఆవిష్కరించారు. దెందులూరులో బ్యాంక్‌ను అనతి కాలంలోనే దెందులూరుతో పాటు సమీప గ్రామాల్లో వినియోగదారులు ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ జట్టుకు దంత వైద్య విద్యార్థిని



సౌత్ జోన్ మహిళల వాలీబాల్ జట్టుకు ఎంపికైన సహిస్త అంబ్రిన్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెదవేగి : సౌత్ జోన్ మహిళల వాలీబాల్ జట్టుకు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్ గురువారం తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాల దంత కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సహిస్త అంబ్రిన్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల్లో నిర్వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఈ త్రిమూర్తి సారథ్యంలో సౌత్ జోన్ మహిళల వాలీబాల్ సెలెక్షన్‌లో విద్యార్థిని ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈమె జనవరి నెల 7 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ ఎస్ స్లీవ రాజు చెప్పారు. విద్యార్థిని, ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నల్లయ్యను కరస్పాండెంట్ సెక్రెటరీ ఫాదర్ మోజెస్, ప్రిన్సిపాల్, కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్ సిబ్బంది అభినందించారు.

గొల్ల బాబూరావుకు ఘన స్వాగతం

దెందులూరు: కొవ్వలి గ్రామస్తుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు స్వగృహానికి విచ్చేశారు. ఆయన సోదరులు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు గొల్ల వీరాస్వామి, గొల్ల కిరణ్ స్వాగతం ఆయనకు పలికారు. ఎంపీ గొల్ల బాబూరావు పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాశ్మీర్ రాష్ట్రానికి సమావేశాల నిమిత్తం ఆయన బయలుదేరి వెళ్లారు.

కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి

పెదవేగి: అతివేగంగా వచ్చిన కారు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన వాక జితేంద్రకుమార్ 2024 డిసెంబర్ 28న వారి కుటుంబ సభ్యులతో కలిసి మోటార్ సైకిల్‌పై ఏలూరు దుస్తుల కొనుగోలుకు వెళుతుండగా ఏపీ 39 ఏఏ 1900 నంబర్ గల కారును డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి వెనుక నుంచి ఢీకొట్టినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో జితేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 2025 జనవరి 2న వాక జితేంద్రకుమార్ (59) మృతి చెందాడని ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

జూదం, కోడి పందేల నిర్వాహకులపై కఠిన చర్యలు

ఉంగుటూరు: సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట, కోడిపందేలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ హెచ్చరించారు. గురువారం కాకర్లమూడిలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి లా అండ్ ఆర్డరు సమస్య వచ్చినా సహించేది లేదని తెలిపారు. సర్పంచి నాగు, గ్రామస్తులు పాల్గొన్నారు.